క్లుప్తంగా

ఆశాజనకంగా అపరాల సాగు



అంబఖండిలో ఆశాజనకంగా పెసరపంట

రేగిడి: మండలంలో రైతులు సాగుచేస్తున్న అపరాల పంట ఆశాజనకంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు మినప, పెసర పంటలు బాగా మొలకెత్తాయి. అంబఖండి, ఉంగరాడ, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస, వన్నలి తదితర గ్రామాల్లో అధికశాతం రైతులు అపరాల పంటను రైతులు సాగుచేస్తున్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



సీసీరోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రాజాం: మండలంలో ముద్దాడజోగివలస గ్రామంలో రూ.3 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

జోరందుకున్న చెరుకు కోతలు



వన్నలిలో ఫ్యాక్టరీకి తరలించేందుకు సిద్ధం చేసిన చెరుకుపంట

రేగిడి: సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం క్రషింగ్ ప్రారంభించడంతో చెరుకు పంట కోతలు జోరందుకున్నాయి. ఖండ్యాం, వన్నలి, అంబఖండి, లింగాలవలస, కొమెర తదితర గ్రామాల్లో రైతులు పంటకోత పనుల్లో నిమగ్నమయ్యారు. ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి పంటకోతలు చేపడుతున్నారు. కోసిన చెరుకు గెడలను ట్రాక్టర్లు, లారీల ద్వారా ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు



విత్తనాలు అందిస్తున్న ఏఓ కన్నబాబు

వంగర: అంతర పంటలతో అధిక లాభాలు పొందవచ్చని ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు. మండలంలోని కింజంగిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి మొక్కజొన్న పంటలో అంతరపంటగా వేసుకునే గోరుచిక్కుడు విత్తనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఆరోగ్యకర ఉత్పత్తులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ఏబీవీపీ(అఖిల భారత విద్యార్థి పరిషత్) నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. ఏబీవీపీ విభాగ్ ప్రముఖ్ బోండా కాశీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రగడ సత్యనారాయణ, టి.ధనుంజయ్, ఉపాధ్యక్షుడిగా జి.మహేష్, సహాయ కార్యదర్శిగా బి.వెంకటేష్‌లతో పాటు మరో 10 మంది కార్యవర్గ సభ్యులుగా ఎంపికయ్యారు. అనంతరం సభ్యులు సమావేశమై, విద్యార్థుల సమస్యలపై పోరాటం చేసేందుకు పలు తీర్మానాలు చేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

బొబ్బిలి: పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న దాడితల్లి కోవెలలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పిండిప్రోలు మణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో పండితుల బృందం వేదమంత్రోచ్చరణల నడుమ స్వామి కల్యాణం చేశారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై, స్వామి వారి కల్యాణోత్సవం తిలకించారు.

- బెంబేలెత్తిస్తున్న వంటనూనెల ధరలు
- లీటరుపై రూ.40 నుంచి రూ.50 వరకు భారం
- అదే తరహాలో కూరగాయల ధరలు
- కొనుగోలు చేయలేని దుస్థితిలో సామాన్యులు
- ధరల నియంత్రణ చేయాలని ప్రజల విజ్ఞప్తి

వంటనూనెల ధరలు సలసల

రామభద్రపురం:

వంటనూనెల ధరలు కాక పుట్టిస్తున్నాయి. ఏ కంపెనీ నూనె కొనుగోలు చేద్దామన్నా ఇంతకుముందు ఉన్నదాని కన్నా భారీగా ధర ఉండడంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఏ కూర వండాలన్నా అందులోకి నూనె అవసరం. అయితే ఇప్పుడు విపరీతంగా పెరిగిన వంటనూనెల ధరలతో ఏం తినాలన్నా.. ఏ నూనె కొనాలన్నా వెనకా ముందు ఆలోచిస్తున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో లీటరు నూనెపై రూ.40 నుంచి రూ.50 వరకు ధర పెరిగింది. దీంతో సామాన్యుడి వంటిట్లో పొయ్యి వెలగడం కష్టమైంది. గంజి అన్నమే గతి అవుతోందని పలు నిరుపేద కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ధరల నియంత్రణకు వెనకడుగు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి ఆరు నెలలు గడుస్తున్నా ధరల నియంత్రణపై వెనకడుగు వేస్తున్నాయి. ప్రకృతి వైరీత్యాల కారణంగా పంటలు సరిగా పండక రైతులు, రైతు కూలీలు, సంక్షేమ పథకాలు అందక నిరుపేద ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న తరుణంలో పెరిగిన వంటనూనెలు మరింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. కోరుకున్న, రుచికరమైన ఆహారం తినలేకపోతున్నారు. ఆరు నెలల క్రితం మార్కెట్‌లో లీటరు పామాయిల్ ధర రూ.90 ఉండగా, ఇప్పుడు రూ.132కు పెరిగింది. రిఫైన్డ్ ఆయిల్ ధర రూ.95 ఉంటే అది ప్రస్తుతం రూ.136కి చేరింది. సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర రూ.100 ఉంటే రూ.146కి పెంచేశారు. వేరుశనగ నూనె ధర రూ.160 నుంచి రూ.200 పెరిగింది. నువ్వుల నూనె రూ.360 నుంచి రూ.420 అయింది. దిగుమతి సుంకం 20 శాతానికి పైగా పెరగడం వల్లే నూనెల ధరలు పెరిగాయని కొందరు చెబుతుండగా, కొందరు వ్యాపారులైతే మళ్లీ ఒక్కో లీటరు నూనెపై రూ.30 నుంచి రూ.40 ధర పెరుగుతుందని చెబుతున్నారు.





ఓ షాపులో స్టోర్ చేసిన నూనె డబ్బాలు

ధరల స్థిరీకరణ ఉండాలి..



ఎలా పడితే అలా ధరలు పెంచితే ఎలా బతకాలి. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి, ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. వంటనూనెల ధర పెరిగిపోవడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు. ప్రజలకు అండగా ఉంటామని ఎన్నికల సమయంలో చెప్పిన మాటలను కూటమి ప్రభుత్వ నేతలు మరిచిపోయారు. ఇలా ధరలు పెంచితే మాలాంటి పేద, మధ్య తరగతి కుటుంబాలు ఎలా జీవించాలి.

-చింతల సింహాచలం, గృహిణి

అన్ని సరుకులూ రేషన్ షాపుల్లోనే ఇవ్వాలి..



గతంలో మాదిరి అన్ని నిత్యావసర సరుకులూ రేషన్ షాపుల్లోనే ఇవ్వాలి. కందిపప్పు, నూనె, చక్కెర, సబ్బులు, రాగులు, గోదమపిండి ఇలా అన్ని చౌకధరల దుకాణం(రేషన్ షాపు) వద్దే ఇచ్చేవారు. ఇప్పుడూ అలానే ఇవ్వాలి. అప్పుడే పేదలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

-బప్పుదాల శాంతమ్మ, గృహిణి

పేదలపై అదనపు భారం..



ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరిగాయి. ఇప్పుడు వంటనూనెల ధరలు పెరగడంతో మాలాంటి పేదలు ఏమీ కొనలేని దుస్థితి. ఒక్కసారిగా ధరలు పెరగడమంటే పేదలపై అదనపు భారం పడడమే. సామాన్య జనానికి అందుబాటులో నిత్యావసర సరుకులు, వంట నూనెల ధరలు ఉండేలా ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలి.

-కోట సత్తెమ్మ, గృహిణి

కూరగాయ ధరలూ అంతే..

వంటనూనెల ధరలు పెరిగిన మాదిరిగానే కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ.50కు తక్కువ లేదు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సామాన్య ప్రజలు మార్కెట్‌కు వెళ్లేందుకు భయపడుతున్నారు. రూ.500 తీసుకువెళ్తే కనీసం సంచి నిండా సరుకులు రావడం లేదని వాపోతున్నారు. ఉప్పు నుంచి ప్రతీది పెరిగి ఉందని, ఇలా అయితే ఎలా బతకాలని ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే పండగల సమయాల్లో ఇంకెలా ధరలు ఉంటాయోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కసారిగా పెంచడం సరికాదు..



నూనె లేనిదే వంట చేయలేం.. నిత్యం ఉపయోగించే వంటనూనెల ధరలు ఒకేసారి ఇంత అధికంగా పెంచడం సరికాదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

-మామిడి అప్పమ్మ, గృహిణి





భారీ వాహనాలతో అవస్థలు



బొబ్బిలి నుంచి తెర్లాం మీదుగా రాజాం వైపు నిత్యం భారీ వాహనాల రాకపోకలతో జనం అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. బొబ్బిలి నుంచి సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి చెరకు లోడుతో లారీలు వస్తున్నాయని, అవి వస్తున్నప్పుడు ఎదురుగా, వెనక నుంచి వస్తున్న వాహనాలను తప్పించేందుకు నానా ఇక్కట్లు పడుతున్నామని వాహనదారులు చెబుతున్నారు. గతంలో చెరకు లోడు లారీల పైభాగం.. విద్యుత్ వైర్లకు తగలడంతో ప్రమాదాలు జరిగాయని, మళ్లీ అటువంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి నుంచి వచ్చే భారీ వాహనాలను రామభద్రపురం మీదుగా రాజాం వెళ్లేలా చర్యలు తీసుకుంటే ఇబ్బందులు ఉండవని పలువురు కోరుతున్నారు.

-తెర్లాం

కానరాని పాలిథిన్ నిషేధం



పాలిథిన్ నిషేధం, ప్లాస్టిక్ నియంత్రణలపై ప్రభుత్వం, అధికారులు చేపడుతున్న చర్యలు మొక్కుబడిగా ఉంటున్నాయనే దానికి నిదర్శనమే రామభద్రపురంలోని శాఖా గ్రంథాలయం సమీపంలోని రోడ్డు పక్కన పడి ఉన్న ఈ పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ వ్యర్థాలు. నిత్యం అవగాహన కల్పిస్తున్నా.. ఉల్లంఘనులకు అపరాద రుసుం విధిస్తున్నా పరిస్థితి మారడం లేదు. గ్రామాలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా నిషేధిత ప్లాస్టిక్, పాలిథిన్ సంచులే కనిపిస్తున్నాయి. అధికారులు చర్యలు కఠినతరం చేస్తే తప్ప నిషేధం అమలయ్యేలా కనిపించడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

-రామభద్రపురం

పాడైన పైప్‌లైన్



మండలంలో ఉంగరాడమెట్ట వద్ద ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న తాగునీటి పైపులైన్ లీకులకు గురికావడంతో రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

-రేగిడి

మత్తుపదార్థాలతో జీవితం చిత్తు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేంద్రరావు

సంతకవిటి: మత్తుపదార్థాలతో జీవితం చిత్తు అవుతుందని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు అన్నారు. మండలంలోని గోళ్లవలస గ్రామంలో ఎస్‌ఐ ఆర్.గోపాలరావుతో కలిసి ఆదివారం పర్యటించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనార్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. యువత మద్దుపదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసైతే కుటుంబం మొత్తం వీధిన పడుతుందని, భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అపరిచితులకు ఎట్టి పరిస్థితుల్లో బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్, ఓటీపీ వివరాలు తెలియజేయొద్దని సూచించారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడి లెక్కింపు



పంటకోత ప్రయోగాలను పరిశీలిస్తున్న డీఎస్‌ఓ వరహాలరావు

రాజాం: మండలంలో దోసరి, గడిముడిదాం, ఆగూరు, అమరాం తదితర గ్రామాల్లో నిర్వహించిన పంటకోత ప్రయోగాలను జిల్లా గణాంక అధికారి ఎం.వరహాలరావు ఆదివారం పరిశీలించారు. వరి మడుల్లో పంటను సేకరించి ధాన్యం తీసి, దిగుబడి అంచాన వేసే విధానంపై ఆరాతీశారు. ఈ ఏడాది దిగుబడి బాగుందని వెల్లడించారు. సకాలంలో ధాన్యాన్ని అమ్ముకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రాజాం ఏఎస్‌ఓ బాలమోహన్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



రేగిడి: ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలావతి



వంగర: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

వంగర: మండలంలోని వంగర, మగ్గూరు, మద్దువలస జంక్షన్ల వద్ద ఎస్సై షేక్ శంకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా ప్రయాణాలు సాగించే వాహన చోదకులపై అపరాధ రుసుం విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహన చోదకులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

రేగిడి: వాహనాలపై ప్రయాణించే సమయంలో ప్రమాదాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ఎస్‌ఐ పి.నీలావతి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఉంగరాడమెట్ట వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా ప్రయాణించేవారిపై గుర్తించి అపరాధ రుసుం విధించారు. వాహన చోదకులకు రోడ్డు భద్రత నిబంధనలను వివరించారు.

నీమాస్త్రం తయారీపై అవగాహన



నీమాస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: మండలంలో కొఠారిపురం గ్రామంలో రైతులకు నీమాస్త్రం తయారీపై ప్రకృతి వ్యవసాయ విభాగం ఎల్-1 పి.రమాదేవి, ఐసీఆర్‌పీ టి.అరుణకుమారి ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో ఇంటి పెరట్లో కూరగాయల సాగు, చీడపీడల నివారణ పద్ధతులను వివరించారు. నీమాస్త్రం తయారీపై శిక్షణ ఇచ్చారు. 10 కిలోల వేపాకు, 10 లీటర్లు ఆవు మూత్రం, 2 కిలోల పేడను 200 లీటర్ల నీటిలో కలిపి, మూడురోజుల పాటు నిల్వ ఉంచడం ద్వారా నీమాస్త్రం తయారు చేయవచ్చని వెల్లడించారు. పంటకు నీమాస్త్రం వినియోగించడం ద్వారా పురుగు గుడ్డు దశలోనే అంతమైపోతుందని తెలిపారు.

జూదరుల అరెస్ట్

బొబ్బిలి: మండలంలోని పెంట, కొత్త పెంట గ్రామాల మధ్య ఓ చోట గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.6,540 నగదు స్వాధీనం చేసుకున్నారు.

సన్మానం

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. బొబ్బిలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి కల్యాణచక్రవర్తి, పార్వతీపురం జిల్లా అదనపు న్యాయమూర్తి ఎస్.దామోదరరావు, బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, బార్ అసోసియేషన్ సభ్యులంతా ఆయనను దుశ్శాలువాలతో సన్మానించారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులు పుస్తక పఠనం చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులతో లైబ్రేరియన్ పుస్తక పఠనం చేయించారు. ఆ తర్వాత విద్యార్థులతో వివిధ రకాల ఆటలు ఆడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, పుస్తకాలు చదివితే అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందన్నారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. గ్రంథాలయానికి రోజూ వచ్చి వార్తా పత్రికలు, నీతి కథల పుస్తకాలు, మిగతా కాంపిటేటివ్ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 570 మంది హాజరు



పరీక్షను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో మోహనరావు

బొబ్బిలి: పట్టణంలోని 3 పరీక్ష కేంద్రాల్లో ఆదివారం జరిగిన ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షకు 570 మంది విద్యార్థులకు హాజరైనట్లు డిప్యూటీ ఈవో కె.మోహనరావు తెలిపారు. పాట్టి శ్రీరాములు, శ్రీవేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలు సహా అభ్యుదయ ఉన్నత పాఠశాలలో జరిగిన పరీక్షను ఆయన వేర్వేరు సమయాల్లో వెళ్లి, పరిశీలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు రాస్తున్న ఈ పరీక్షలో ఎంపికైన వారికి తర్వాత ఐదేళ్ల పాటు ఏటా రూ.12 వేలు స్కాలర్‌షిప్ కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.